శంభులింగేశ్వర ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కిశోర్ పూజలు

మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

తిరుమలగిరి, డిసెంబర్ 2: మండల పరిధిలోని గుండెపురి శంభులింగేశ్వరస్వామి ఆలయంలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందించారు. బీఆర్ఎస్ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సతీశ్, బర్ల వెంకన్న, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడికి నివాళి

తుంగతుర్తి: మండల కేంద్రానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఓరుగంటి సత్యనారాయణ సోమవారం అనారోగ్యంతో మృతిచెందగా, ఆయన భౌతిక కాయానికి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, కల్లెట్లపల్లి ఉప్పలయ్య, అంబయ్య గౌడ్, మాజీ ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, తునికి సాయిలుగౌడ్, దొంగరి శ్రీను, ఉప్పుల నాగమల్లు, గోపగాని వెంకన్న, సంతోశ్ పాల్గొన్నారు.

నాగారం: ఫణిగిరికి చెందిన దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ ఆవుల సతీశ్ తల్లి వీరమ్మ ఇటీవల మరణించగా, మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల పార్టీ అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, గుండగాని అంబయ్య, యారాల రాంరెడ్డి, యాదగిరి, మహేశ్ పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా మల్లు నాగార్జున్‌రెడ్డి

- 9 మందితో జిల్లా కార్యదర్శివర్గం, 34 మందితో జిల్లా కమిటీ ఎన్నిక

మల్లు నాగార్జున్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 2: సీపీఎం జిల్లా కార్యదర్శిగా మల్లు నాగార్జున్‌రెడ్డి తిరిగి ఎన్నికయ్యారు. నవంబర్ 29, 30, డిసెంబర్ 1వ తేదీల్లో సూర్యాపేటలో జరిగిన సీపీఎం జిల్లా మూడో మహాసభల్లో జిల్లా కార్యదర్శిగా మల్లు నాగార్జున్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికవగా, 9 మందితో జిల్లా కార్యదర్శివర్గం, 34 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం జాబితా వెల్లడించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, పారేపల్లి శేఖర్‌రావు, నాగారపు పాండు, మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి, కోట గోపి, ముల్కలపల్లి రాములుతో పాటు మరొకరు ఎన్నికయ్యారు. అదేవిధంగా జిల్లా కమిటీ సభ్యులుగా దండ వెంకటరెడ్డి, వేల్పుల వెంకన్న, నరసింహారావు, ధనియాకుల శ్రీకాంత్, వీరబోయిన రవి, కొప్పుల రజిత, మేకనబోయిన శేఖర్, మద్దెల జ్యోతి, కందాల శంకర్‌రెడ్డి, బుర్ర శ్రీనివాస్, పులుసు సత్యం, మిట్టగడుపుల ముత్యాలు, బెల్లకొండ సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, పల్లె వెంకట్‌రెడ్డి, దుగ్గి బ్రహ్మం, భూక్య పాండునాయక్, వట్టిపు సైదులు, షేక్ యా కూబ్, కోదమ గుండం నగేశ్, కందగట్ల అనంత ప్రకాశ్, షేక్ సైదా, జూలకంటి విజయలక్ష్మి, బచ్చలకూర స్వరాజ్యం ఎన్నికయ్యారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వీఆర్ఏలు

సూర్యాపేట, డిసెంబర్ 2: వీఆర్ఏలకు పే స్కేల్, వారసులకు ఉద్యోగాల హామీని అమలు చేయాలని కోరుతూ వీఆర్ఏలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 80 రోజుల దీర్ఘకాలిక ఆందోళనతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ నంబర్ 81,80 విడుదల చేసిందని, దీంతో చదువుకున్న వారిని ఇతర శాఖలకు కేటాయించారని తెలిపారు. చదువురాని, వయసు పైబడినవారి పిల్లలకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, కానీ ప్రభుత్వం మారడంతో ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ హామీని అమలు చేయడం లేదని మండిపడ్డారు. 16 నెలలుగా వయసు పైబడి అనారోగ్యంతో ఉన్నవారి ఉద్యోగాలను వారి వారసులు చేస్తున్నారని, వెంటనే వారిని ప్రభుత్వం వీఆర్ఏలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- ఎంఈఓ సలీంషరీఫ్

విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ సలీంషరీఫ్

కోదాడ రూరల్, డిసెంబర్ 2: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మండల విద్యాధికారి ఎంఏ.సలీంషరీఫ్ అన్నారు. బీసీ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థుల రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపికైన స్థానిక పాఠశాల విద్యార్థులు పి.నాదన్‌రెడ్డి, వి.సైదులు, ఆర్.సంతోశ్, పి.భానుతేజను సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం డి.మార్కండేయ, అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు రాష్ట్రీయ సర్వేక్షణ్-24 పరీక్ష

మూడేళ్లకు ఒకసారి 3,6,9 తరగతులకు చెందిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునేందుకు నిర్వహించే పరాక్ (రాష్ట్రీయ సర్వేక్షణ్-24) పరీక్షను ఈ నెల 4వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సలీంషరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోదాడ మండల పరిధిలోని 17 పాఠశాలలకు చెందిన 1,424 మంది విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, డిసెంబర్ 2: ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనలకు లోబడి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కలెక్టర్, అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. సుమారు 72 దరఖాస్తులు రాగా, కలెక్టర్ వాటిని ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శాఖల వారీగా ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వారికి అందించే నష్ట పరిహార చెల్లింపుల నిమిత్తం విపత్తు నివారణ కమిటీ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖలు నివేదికలు తయారు చేసి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఈఓ అశోక్, సీపీఓ కిషన్, డీడబ్ల్యూఓ నర్సింహారావు, డీఎంహెచ్ఓ కోటాచలం పాల్గొన్నారు.

కోదాడ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ టౌన్ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్ శోభారాణి

మోతె, డిసెంబర్ 2: కోదాడ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రూ.25 కోట్లతో మోతె నుంచి విజయవాడ జాతీయ రహదారి వరకు ఏర్పాటు చేయనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం మండల కేంద్రంలో ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సాగు, తాగునీటికి, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మాజీ ఎమ్మెల్యే వి.చందర్‌రావు, ఆర్డీవో వేణుమాధవ్, ఏసీపీ నాగేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఈఈ సీతారామయ్య, మోతె తాసీల్దార్ ఎస్.సంఘమిత్ర పాల్గొన్నారు.

నడిగూడెం: కాగిత రామచంద్రాపురం నుంచి బరాఖత్‌గూడెం వరకు చేపట్టనున్న రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, ఆర్డీవో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రం అనంతగిరి నుంచి చనుపల్లి వరకు రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రెండు వరుసల బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే పద్మావతితో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండల కేంద్రంలోని చౌరస్తాలో సోమవారం శంకుస్థాపన చేశారు. మాజీ ఎంసీసీ చుండూరు వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ కొణతం ఉమ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: కోమరబండ వై జంక్షన్ సమీపంలోని పారిశ్రామిక ఆధారిత వృత్తి నైపుణ్య కేంద్రం శంకుస్థాపనలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ శోభారాణి పాల్గొన్నారు.

మంత్రి పర్యటనలో అపశృతి

మోతె: మండల కేంద్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాఘవాపురం ఎక్స్ రోడ్డు నుంచి మోతె వరకు పార్టీ శ్రేణులు నిర్వహించిన ర్యాలీలో నరసింహులగూడెం గ్రామానికి చెందిన వసీం, నానేసాహెబ్ ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఎమ్మెల్యే పద్మావతి ఆసుపత్రికి తరలించారు.

మత సామరస్యాన్ని చాటిన బీఆర్ఎస్ కౌన్సిలర్

అయ్యప్ప మాలధారుల ఆశీస్సులు పొందుతున్న కౌన్సిలర్ తాహేర్‌పాషా

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 2: సూర్యాపేట 40వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎస్‌కే.తాహేర్‌పాషా 100 మంది అయ్యప్ప మాలధారులకు సోమవారం తన నివాసంలో అన్నప్రసాద వితరణ చేపట్టి మత సామరస్యాన్ని చాటారు. మతం పట్టించుకునే వారికే తప్ప మానవతావాదులకు కాదని తాహేర్‌పాషా నిరూపించారని మాలధారులు కొనియాడారు.

వ్యవసాయ కార్మికులకు పెన్షన్ అమలు చేయాలని ధర్నా

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 2: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేల పెన్షన్ ఇస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పేర్ల నాగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పెరుగుతున్న ధరల కారణంగా వ్యవసాయ కార్మికులకు ఇచ్చే కూలి సరిపోక జీవనం సాగించడం కష్టమైతుందన్నారు. సంవత్సరానికి రూ.24 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు కారింగుల వెంకన్న, గులాం హుస్సేన్, పిడమర్తి లింగయ్య, రజాక్, రాయల రాజ్‌కుమార్, శంకర్‌ప్రసాద్, రమేశ్, విజయ్, ఉపేందర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులు ఉద్యమాలకు ఊపిరిలూదాలి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 2: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా నాట్య మండలి కళాకారులు తమ కలాలకు, గళాలకు పదును పెట్టి ఉద్యమాలకు ఊపిరిలూదాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. సోమవారం సూర్యాపేటలోని బొమ్మగాని ధర్మభిక్షం భవన్‌లో తెలంగాణ ప్రజా నాట్య మండలి (పీఎన్ఎం) సూర్యాపేట జిల్లాస్థాయి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కళ ప్రజా చైతన్యానికి ఆయుధమని, సామాజిక రుగ్మతలపై యువతను చైతన్యం చేయాల్సిన బాధ్యత కళాకారులేదనని అన్నారు. అనంతరం తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశ ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి సామాజిక న్యాయం లభించాలంటే వామపక్ష ఉద్యమం బలోపేతంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, పీఎన్ఎం జిల్లా నిర్మాణ బాధ్యుడు దూళిపాళ ధనుంజయనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు గుండు వెంకటేశ్వర్లు, తెలంగాణ పీఎన్ఎం జిల్లా అధ్యక్షుడు జంపాల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి దొంతగాని సత్యనారాయణ, సీపీఐ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్, వెంకటేశ్వర్లు, ఎడెల్లి శ్రీకాంత్, తొట్ల ప్రభాకర్, రామిరెడ్డి, సైదులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

తిరుమలగిరి, డిసెంబర్ 2: కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ మండల కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాలని, అప్పటి వరకు మినిమం టైం స్కేలు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమ సమస్య పరిష్కరిస్తామని అన్నారని గుర్తు చేశారు. నిరసన కార్యక్రమంలో పోరెల్ల వెంకన్న, రాధార సోమేశ్, పెరుమాళ్ల రాజీవ్, వాణి, కొల్లూరి సత్యనారాయణ, చింతకుంట్ల నరేశ్, పులిగిల్ల శ్యామ్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

నాగారం, డిసెంబర్ 2: విద్యుత్ షాక్‌తో మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని ఈటూరు గ్రామ పంచాయతీ ఆవాసం ప్రగతి నగర్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ప్రగతి నగర్‌కు చెందిన గంట గీత (49) ఇంటి వద్ద ఉన్న పశువులకొట్టం దగ్గర పాలు పితికేందుకు వెళ్లగా, ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

ప్రజావాణితో సమస్యలకు సత్వర పరిష్కారం

- తాసీల్దార్ శ్రీనివాసరావు

నూతనకల్, డిసెంబర్ 2: ప్రజావాణి కార్యక్రమంతో సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని తాసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం తాసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాటాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఇందిర, ఏపీఎం కరుణాకర్, మండల వ్యవసాయశాఖ అధికారి మురళి, పీఆర్ ఏఈ లావణ్య, ఎంఈఓ రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారి బాధ్యతల స్వీకరణ

పాలకవీడు, డిసెంబర్ 2: పాలకవీడు మండల పశువైద్యాధికారిగా నారాయణ రాథోడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు.

పీఏసీఎస్ పాలక మండలి సభ్యులను కొనసాగించాలి

- హైకోర్టు ఉత్తర్వులు

గరిడేపల్లి, డిసెంబర్ 2: మండలంలోని సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సంబంధించి మెజార్టీ సభ్యులు రాజీనామా చేయడంతో పాలక మండలిని రద్దు చేస్తూ గత నెల 8వ తేదీన సూర్యాపేట డీసీవో ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆ ఆదేశాలను సవాల్ చేస్తూ పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంబిరెడ్డి, మరో నలుగురు డైరెక్టరు హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం విచారించిన న్యాయస్థానం తదుపరి ఎన్నికలు నిర్వహించేంత వరకు పాత పాలక మండలి సభ్యులను కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

వన నర్సరీలను పరిశీలించిన ఎంపీడీఓ

రామన్నగూడెం నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

అర్వపల్లి, డిసెంబర్ 2: మండల పరిధిలోని వేల్పుచర్ల, రామన్నగూడెం, ఉయ్యాలవాడ, కుంచమర్తి, అడివెంల గ్రామాల్లోని వన నర్సరీలను ఎంపీడీఓ సత్యనారాయణ రెడ్డి సోమవారం పరిశీలించారు. మొక్కలను సంరక్షించాలని సూచించారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

నూతనకల్, డిసెంబర్ 2: స్త్రీనిధి, బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని సెర్ప్ ఏపీఎం రమణాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మహిళ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని కోరారు. మహిళా సంఘాల సభ్యులు సుమారు 15 నుంచి 20 మంది కలిసి రైతుమిత్ర సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ప్రతి కుటుంబం మరుగుదొడ్లు నిర్మించుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో సిబ్బంది నాగార్జునరెడ్డి, ముత్తయ్య, మల్లేశ్, సరస్వతి, భాగ్యలక్ష్మి, గీత తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు బాధితులకు భరోసా కల్పించాలి

- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

మహిళా కానిస్టేబుల్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 2: పోలీసు విధులు చాలా ప్రత్యేకమైనవని, ఇతర శాఖల విధులతో పోలిస్తే సవాళ్లు, లక్ష్యాలతో కూడుకున్నవని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న 281 మంది నూతన కానిస్టేబుళ్లను జిల్లాకు కేటాయించగా, సోమవారం ఎస్వీ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధులు నిర్వర్తించే సమయంలో క్రిమినల్స్ పట్ల కఠినంగా వ్యవహరిస్తూనే సాధారణ ప్రజలతో స్నేహపూర్వక వాతావరణం కలిగి ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసా కల్పించాలని తెలిపారు. బాగా పనిచేసిన వారికి సమాజంలో గుర్తింపు ఉంటుందని అన్నారు. క్రమశిక్షణ లేకుండా, ప్రజలను ఇబ్బందులు పెడితే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విధి నిర్వహణలో పురుషులు, మహిళలు అందరూ సమానమేనని, అన్ని విధులు అందరూ నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, జిల్లాకు కేటాయించిన వారిలో 197 మంది సివిల్, 84 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు ఉన్నారు. సివిల్ విభాగంలో 68 మంది, ఏఆర్‌లో 19 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, ఆర్మ్‌డ్ ఇన్‌స్పెక్టర్లు నారాయణరాజు, నరసింహ, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఆర్ఎస్సైలు సురేశ్, అశోక్, అన్వర్ పాల్గొన్నారు.

మూడ్రోజుల క్రితం పెళ్లి.. రోడ్డు ప్రమాదంలో నవ వరుడు మృతి

- భార్యకు తీవ్ర గాయాలు

మేళ్లచెర్వు, డిసెంబర్ 2: రోడ్డు ప్రమాదం నవ వరుడి ప్రాణాలను బలితీసుకుంది. కాళ్ల పారాణి ఆరకముందే వధువు ఆసుపత్రి పాలైంది. ఈ విషాదకర ఘటన మండల కేంద్రంలోని హుజూర్‌నగర్ రోడ్డులో జంగాల కాలనీ వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన రాసూరి ఉపేందర్ (32)కు మేళ్లచెర్వు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన రత్నకుమారితో గత శుక్రవారం వివాహం జరిగింది. ఉపేందర్ తన భార్యతో కలిసి బైక్‌పై అత్తవారింటికి వెళ్తుండగా, మేళ్లచెర్వు శివారులోని జంగాల కాలనీ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. చీకటి పడటంతో ట్రాక్టర్ కనిపించక ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ఉపేందర్ అక్కడికక్కడే మృతిచెందగా, రత్నకుమారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. దీంతో రెండు కుటుంబాల్లో విషాదం అలుముకుంది.

400 గ్రాముల గంజాయి పట్టివేత

- నలుగురు అరెస్ట్

నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

కోదాడ రూరల్, డిసెంబర్ 2: గంజాయితో పట్టుబడిన నలుగురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని చిమిర్యాల శివారు బ్రిడ్జి వద్ద, కోదాడ పట్టణ శివారులో సోమవారం ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే అటుగా వచ్చిన రెండు బైక్‌లను ఆపి తనిఖీ చేయగా నలుగురి వద్ద 400 గ్రాముల గంజాయి పట్టుబడింది. నిందితులను కోదాడకు చెందిన ఎస్‌కే.మగ్దూమ్ పాషా, కోదాడ మండలం దోరకుంటకు చెందిన పిట్టల యుగేందర్, వీరబోయిన మధు, అనంతగిరి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన భూక్య గోపాల్‌గా గుర్తించారు. నలుగురిని అరెస్ట్ చేసి రెండు బైక్‌లను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన లారీ.. ఇద్దరికి గాయాలు

మఠంపల్లి, డిసెంబర్ 2: ఆటోను లారీ ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని బక్కమంతులగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని లాలితండాకు చెందిన ఆటో డ్రైవర్ బానోతు రాముడు మఠంపల్లి నుంచి హుజూర్‌నగర్ వెళ్తున్నాడు. బక్కమంతుల గూడెం గ్రామ సమీపంలోకి రాగానే ఆటో ముందుగా వెళ్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో రాముడు తన ఆటో వేగం తగ్గించాడు. ఈ క్రమంలోనే మరో లారీ ఆటోను వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో